## క్లుప్తంగా

### ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం రాయితీ

**కొత్తకోట:** రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 154 ద్వారా ప్రవేశపెట్టిన వన్ టైమ్ సెటిల్మెంట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొత్తకోట మున్సిపాలిటీ కమిషనర్ సైదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్ను బకాయిలపై విధించిన వడ్డీపై 90 శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ గడువు మార్చి 31వ తేదీ వరకు ఉందని, పట్టణ ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. నల్ల పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు సకాలంలో చెల్లించి కొత్తకోట పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

### రేమద్దుల విద్యార్థుల ప్రతిభ



**పాన్‌గల్:** మండలంలోని రేమద్దుల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బడి పిల్లల సంబరాల్లో ప్రతిభ కనబర్చి పలు పోటీల్లో బహుమతులు సాధించినట్లు శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీదేవి తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ టాలెంట్ టెస్టులో భవ్యశ్రీకి ద్వితీయ బహుమతి, హర్షవర్ధన్‌కు తృతీయ బహుమతి, నృత్య ప్రదర్శనలో పాఠశాల విద్యార్థులకు ద్వితీయ బహుమతి, పాటల పోటీలల్లో హర్షవర్ధన్‌కు ప్రథమ బహుమతి లభించాయి. గత నెలల్లో నిర్వహించిన సైన్స్ దినోత్సవ ప్రయోగ పోటీలల్లో భవ్యశ్రీకి ప్రథమ బహుమతి సాధించినట్లు ఆమె పేర్కొన్నారు. మండల స్థాయిలో విద్యార్థులు బహుమతులు సాధించడంపై పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

### 'పది' పరీక్షలకు 441 మంది హాజరు

**ఖిల్లాఘనపురం:** మండలంలో శుక్రవారం నిర్వహించిన పదవ తరగతి పరీక్షకు 443 మంది విద్యార్థులకు గాను 441 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ జయశంకర్ తెలిపారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 228 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 213 మంది విద్యార్థులను కెటాయించగా అందరు హాజరైనట్లు ఎంఈఓ చెప్పారు. మొత్తంగా ఇద్దరు విద్యార్థులు మాత్రమే శుక్రవారం జరిగిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు హాజరు కాలేదన్నారు. ఎలాంటి సమస్య లేకుండా ప్రశాంతంగా విద్యార్థులు పరీక్ష రాయడం జరిగిందని ఆయన చెప్పారు.

### అంబులెన్స్‌లో ప్రసవం



**వీపనగండ్ల:** మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ప్రసవ వేదనతో వచ్చిన మల్లేశ్వరిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. చిన్నంబావి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన మల్లేశ్వరి, కూతురు ఆరోగ్యంగా ఉండడంపై కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. అంబులెన్స్ ఈఎండీ రాము, పైలెట్ మొయినుద్దీన్‌ను పలువురు అభినందించారు.

### నీటి ఎద్దడి నివారించండి

**అమరచింత:** పట్టణంలోని ప్రజలకు వేసవిలో తాగునీటి ఎద్దడి కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి జీఎస్.గోపి ఆధ్వర్యంలో మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటరమణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జీఎస్.గోపి మాట్లాడుతూ పట్టణంలోని 10 వార్డులలో మున్సిపల్‌కు సంబంధించిన 16 సోర్సు బోర్లు ఉన్నాయని, వీటితో పాటు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్న ప్రజలకు పూర్తి స్థాయిలో తాగు నీరు ఎందుకు అందడం లేదని ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో రాజు, ఆర్ఎన్.రమేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

### తల్లీకొడుకుల అదృశ్యం



మాధవి, మహేష్ (ఫైల్)

**అమరచింత:** పెండ్లి వేడుకలకు వచ్చిన తల్లీ కొడుకు తిరిగి ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు వారి కోసం వెతుకులాట ప్రారంభించిన సంఘటన మండలంలోని సింగంపేటలో చోటుచేసుకుంది. సింగంపేట గ్రామానికి చెందిన మాధవి కుమారుడు మహేష్(4)ను వెంటపెట్టుకుని అమరచింతలో ఈనెల 16న బంధువుల పెండ్లికి వెళ్లింది. పెండ్లి తర్వాత ఇప్పటి వరకు ఇంటికి రాలేదు. బంధువుల గ్రామాలకు వెళ్లి విచారించిన ఫలితం లేక పోయింది. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగానే ఆమె ఇంటి నుంచి వెళ్లిఉండొచ్చని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మాధవి, మహేష్‌లు కనిపించడం లేదని కుటుంబ సభ్యులు అమరచింత పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

**కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి:** త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల సీఈఓ సుదర్శన్ రెడ్డి చట్టాల అమలు, శాంతి భద్రతలు, ఓటరు జాబితా సవరణపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ నేపథ్యంలో జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వీసీకి హాజరయ్యారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. గతంలో నిర్వహించిన ఎన్నికల కంటే మెరుగ్గా రానున్న రోజుల్లో ఎన్నికలు నిర్వహించేందుకు, అన్ని వర్గాలకు చెందిన ఓటర్లను భాగస్వామ్యం చేసేందుకు వినూత్న కార్యక్రమాల అమలుకు, పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సలహాలు సూచనలు అందించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి మార్గదర్శకాలపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరికి తమ విధులు గురించి పూర్తిగా తెలిసి ఉండాలన్నారు. సజావుగా శాంతి భద్రతల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు చేపట్టాల్సిన చర్యల గురించి సలహాలు అందించాలన్నారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ రానున్న రోజులలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు, ఓటింగ్ శాతాన్ని మరింత పెంచేందుకు చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో సి సెక్షన్ సూపరిండెంట్ కిషన్, ఇతర ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు



సింగంపేటలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చెన్నమ్మ

**అమరచింత:** గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పని చేసేందుకు జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరు అవకాశం కల్పిస్తామని ఎంపీడీఓ చెన్నమ్మ అన్నారు. మండలంలోని సింగంపేటలో ఉపాధి పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి పనుల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. రైతుల పంటకాల్వలతో పాటు పంటపొలాల చదును వంటి కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉందన్నారు. నర్సరీలలో పెరుగుతున్న మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలన్నారు. ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహించే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవన్నారు.

## ఉపాధి పనులపై సమీక్ష



**చిన్నంబావి:** ఉపాధి పనులు పకడ్బందీగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు మండలకేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రమణారావు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో మార్చి నెల ముగుస్తున్నందున్న ఇంటి పన్నును వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రామస్వామి పాల్గొన్నారు.

## స్వచ్ఛతతో వ్యాధులు దూరం



రాయిణిపేటలో సిబ్బందితో కలిసి డ్రై డేలో పాల్గొన్న ఎంపీఓ సుదర్శన్

**కొత్తకోట రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఫ్రైడే.. డ్రై డే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా చేపట్టాలని, అప్పుడే వ్యాధులను దూరం చేయొచ్చని కొత్తకోట ఎంపీఓ సుదర్శన్ అన్నారు. మండలంలోని రాయిణిపేటలో డ్రై డే కార్యక్రమాన్ని ఎంపీఓ సుదర్శన్ పరిశీలించి సిబ్బందితో కలిసి చెట్లకు నీళ్లు పట్టారు. ప్రతి ఇంట్లో డ్రై డేను విధిగా పాటిస్తూ నీరు నిల్వ ఉండకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన



మంగళ్లపల్లిలో ఉపాధి పనుల వద్ద కూలీల హాజరును పరిశీలిస్తున్న ఏపీఓ కుర్మయ్య

**పాన్‌గల్:** మండలంలోని దావత్‌ఖాన్‌పల్లి, మంగళ్లపల్లి గ్రామాల్లో ఉపాధి పనులను, నర్సరీలను శుక్రవారం ఏపీఓ కుర్మయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవి కాలం కూలీలు ఉదయం వేళల్లో తొందరగా వెళ్లి ఎండ పెరిగే లోపు ఇంటికి తిరిగి రావాలన్నారు. పనుల వద్ద కూలీలకు నీడ, నీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. నర్సరీలలో మొక్కలు గ్రీన్ షెడ్, నీటిని క్రమం తప్పకుండా పడుతూ మొక్కలు ఎండ కుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## ఈద్గా వద్ద పారిశుద్ధ్య పనులు



ఈద్గా ఆవరణలో ముళ్ల పొదలు తొలగిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు

**అమరచింత:** పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఈద్గా పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేసేందుకు మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. శుక్రవారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో ఈద్గా ఆవరణలో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు. పవిత్ర ఈదుల్‌ఫీతర్ నమాజు కోసం మండలంలోని ఆయా గ్రామాల నుంచి ముస్లింలు పట్టణంలోని ఈద్గాకు చేరుకుని ప్రార్థనల్లో పాల్గొనడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. మున్సిపల్ కమిషనర్ రవిబాబు ఆదేశాల మేరకు ఈద్గా ఆవరణమంత శుభ్రపరుస్తున్నారని జామీయ మసీదు కమిటీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్ తెలిపారు.

## కరాటేతో ఆత్మరక్షణ



ఏదుట్ల పాఠశాలలో విద్యార్థినులకు కరాటే నేర్పుతున్న మాస్టర్ రాజు

**గోపాల్‌పేట:** విద్యార్థులు కరాటే నేర్చుకోవడం ద్వారా ఆత్మరక్షణ పెంచుకోవచ్చని కరాటే మాస్టర్ రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని ఏదుట్ల గ్రామంలో విద్యార్థులకు కరాటే పరీక్షలు నిర్వహించారు. మూడు నెలలుగా నేర్చుకున్న కరాటే విద్యను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా ఉండాలి



ఆత్మకూర్‌లోని మస్జిదే ఆజంజాహిలో ప్రసంగిస్తున్న మౌలాన

**ఆత్మకూర్:** ప్రతిఒక్కరు నిరుపేదలకు అండగా ఉండాలని, సంపాదనలో కొంత తప్పనిసరిగా పేదలకు(జకాత్)ఇవ్వాలని మౌలాన అబ్దుల్‌అలీం రశాదీ, మౌలాన జీయా ఉర్ రహ్మాన్, మౌలాన ముక్తదీర్, మౌలానా ఇర్ఫాన్, మౌలాన తమీమ్ అన్సారి, హఫీజ్ అజ్హర్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలోని అత్యంత ప్రాముఖ్యమైన శబేఖద్ర్ పర్వదినం సందర్భంగా స్థానిక మస్జిదే ఆజంజాహి, మస్జిదేసయ్యదియా, ఈద్గామస్జీద్‌లతోపాటు మండలంలోని గ్రామాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ముస్లింలు భక్తిశ్రద్ధలతో షబేఖద్ర్ జరుపుకున్నారు.

**ఆనలుగురు క్షమార్హులు కారు..**

రంజాన్‌మాసంలో శబెఖద్ర్ వెయ్యి నెలలతో సమానమని ఈ ఒక్కరోజు జాగారం చేసి ప్రార్థన(ఇబాదత్) చేస్తే వెయ్యి నెలలపాటు పుణ్యం దక్కుతుందని ప్రతిఒక్కరికి మోక్షం లభిస్తోందన్నారు. తల్లిదండ్రుల పాదాలచెంత స్వర్గం ఉందని, వారిని ఇబ్బందిపెట్టేవారిని అల్లహ్ క్షమించరని, వడ్డీల వ్యాపారం చేసేవారు, జూదం ఆడేవారు, మద్యం తాగేవారు, విగ్రహారాధన చేస్తూ మనుష్యలను పూజించేవారు, కుట్రలు, కుతంత్రాలు చేపడుతూ ఇతరుల గురించి చెడు ప్రచారం చేసేవారు క్షమార్హులు కారని అన్నారు. మస్జీద్ కమిటీ నిర్వాహకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి నగదును అందజేశారు. కార్యక్రమాల్లో ముస్లింలు పెద్దెత్తున పాల్గొన్నారు.

## కిరాణషాపులో చోరీ

**గోపాల్‌పేట:** మూసిఉన్న కిరాణషాపులో చోరీ జరిగిన ఘటన మండలంలోని బుద్దారం గ్రామంలో చోటుచేసుకుంది. గోపాల్‌పేట ఎస్ఐ నరేష్‌కుమార్ వివరాల మేరకు.. కావలి శ్రీను బుద్దారం గ్రామానికి సమీపంలోని గురుకుల పాఠశాల ముందు టీ కొట్టు, కిరాణం షాపు పెట్టుకుని కుటుంబసభ్యులతో బతుకుతున్నారు. గురువారం రాత్రి ఎప్పటి లాగే రాత్రి పడుకున్నారు. శుక్రవారం ఉదయం లేచి చూసేసరికి రూం బయట గల్ల డబ్బాలో ఉన్న రూ.8500 నగదు, ఐదు లీటర్ల పెట్రోలు, ఒక సెల్‌ఫోన్ గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. కావలి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు



బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన వారికి కండువాకప్పి ఆహ్వానిస్తున్న బీజేపీ నాయకులు

**వనపర్తిటౌన్:** బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఏ రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పట్టణ బీసీ సెల్ ప్రెసిడెంట్ పుష్పక్ యాదవ్, 19వ వార్డు మాజీ ప్రెసిడెంట్ పి. బాలరాజు సాగర్‌లు తమ అనుచరులతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీలో చేరారు. ఈ మేరకు వారిని జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యుగేంధర్ సాగర్, స్వామి సాగర్, చిన్న, చంద్రకాంత్, వెంకటేశ్వర్‌లు, కోటి శ్రీనివాసులు, ఎస్. చందు, చిన్న రవి, గోపాల కృష్ణ, శివసాగర్, వెంకట్‌లు బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్. వెంకట్ రెడ్డి, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి శ్రీశైలం, ఓబీసీ మోర్చా రాష్ట్ర కో-ఆర్డినేటర్ చిత్తారి ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్ గౌడ్, ఉపాధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు శ్రీనివాసులు, తిరుమలేష్ పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

**ఆత్మకూర్:** బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని బాల్యవివాహాలను అరికట్టేందుకు కలిసిరావాలని ఎస్ఐ నరేందర్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ స్వరూప అన్నారు. శుక్రవారం ఆత్మకూర్ పోలీస్‌స్టేషన్‌లో జిల్లా మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమశాఖ వారి ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, నిర్వహకులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**గోపాల్‌పేట:** హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. గోపాల్‌పేట ఎస్సై నరేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. నర్సింగాయ పల్లి గ్రామానికి చెందిన దేవర కిష్టయ్య(80) వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. సొంత పనిమీద శ్రీనివాసపూర్ గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్ళి తిరిగి నర్సింగాయపల్లి గ్రామానికి వస్తుండగా వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో గాయాలైన అతన్ని వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## శాంతియుత వాతావరణంలో పండుగ చేసుకోవాలి

**ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



ఇఫ్తార్‌లో పాల్గొన్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**కొత్తకోట రూరల్:** పెద్దమందడి మండలం వెల్టూర్‌లో ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలన్నారు. హిందూ, ముస్లింలు పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, బాలనాగయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యులు రమేష్‌గౌడ్, డి.రమేష్, డీలర్ విజయకుమార్, రామచంద్రయ్య, పట్నం సత్యన్న, ఆంజనేయులు, మల్లికార్జున్, ఎల్.మహేశ్వర్‌రెడ్డి, కావలి రాజు, వివేక్ సాగర్, డీలర్ శ్రీను, దిండు వివేక్ సాగర్, గ్రామ వడ్డెర సంఘం అధ్యక్షుడు వడ్డె శేఖర్, చంద్ర శేఖర్‌రెడ్డి, కొండన్న, ముస్లింలు హఫీస్, రుక్మద్దీన్, లాలు, శంషోద్దీన్, ఎండీ నజ్జు, తదితరులు పాల్గొన్నారు

## ఎంపీడీఓ కార్యాలయం ప్రారంభానికి సిద్ధం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఎంపీడీఓ కార్యాలయం

**అమరచింత:** పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న ఎంపీడీఓ కార్యాలయం మరమ్మతు పనులు తుది దశకు చేరాయి. వారం రోజుల్లో ఎంపీడీఓ కార్యాలయం కొత్త భవనంలోకి మార్చేందుకు మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నారు. మండలంగా ఏర్పడినప్పటి నుంచి ఎంపీడీఓ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుండగా, అద్దె చెల్లించడం లేదని రెండు పర్యాయాలు ఇంటి యాజమాని ఎంపీడీఓ కార్యాలయానికి తాళం వేశాడు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలోని నిరుపయోగంగా ఉన్న గదులను వినియోగించుకుంటున్నారు. ఇందులో భాగంగానే ఉర్దూ మీడియంలో శిథిలావస్థలో ఉన్న నాలుగు తరగతి గదులకు మరమ్మతులు చేసి వాటిలో ఎంపీడీఓ కార్యాలయం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## బీఎస్పీ వనపర్తి అసెంబ్లీ కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

**గోపాల్‌పేట:** ఎస్సీ, ఎస్టీ, బీసీ అణగారిన వర్గాల కోసం బీఎస్పీ కృషి చేస్తుందని, అందులో భాగంగా ఆయా నియోజకవర్గస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి ముందుకు వెళ్తున్నామని ఈసీ మెంబర్ గణపురం కృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వనపర్తి జిల్లా అధ్యక్షుడు గూడెం ఎల్లస్వామి అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇన్‌చార్జి వాల్మీకీబోయ మండ్ల మైబూస్, అధ్యక్షుడిగా దండురాజు, ఉపాధ్యక్షుడిగా బంకల అజయ్, ప్రధాన కార్యదర్శిగా గెడిసె రాంబాబు, కార్యదర్శిగా పానుగంటి శంకర్, కోశాధికారిగా మన్యం ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైనవారు పార్టీ బలోపేతంకొరకు కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా అధ్యక్షుడు మిద్దెమహేష్, పెబ్బేరు టౌన్ అధ్యక్షుడు అశోక్ సామ్రాట్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు గుడిసెధర్మ, మధు, తదితరులు పాల్గొన్నారు.

## పండ్లు, కూరగాయల రైతులను మినహాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

**కొత్తకోట:** రైతు పక్షపాతి అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్లో కురగాయలు, పండ్లు అమ్ముకుంటున్న రైతులను తైబజార్ నుంచి మినహాయించాలని కొత్తకోట బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ సైదయ్యకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ నవీన్ రెడ్డి మాట్లాడుతూ కొత్తకోట మున్సిపాలిటీ నిర్వహించే తైబజార్ వేలంలో కూరగాయలు అమ్మే రైతులను, పండ్లు, పూలు అమ్ముకునే పేద వారిని మినహాయించాలన్నారు. ప్రతివారం నిర్వహించే సంతను ఇప్పటి వరకు జరుగుతున్న ప్రైవేట్ స్థలంలో కాకుండా అన్ని వసతులతో ప్రభుత్వ స్థలంలో నిర్వహించాలన్నారు. అధికారులు తైబజార్ నిర్వహణ జరగకముందే తైబజార్ వేలంలో పాల్గొనే ఆశావాహులకు తెలిసేలా అవగాహన కల్పించాలని సూచించారు. తైబజార్ వేలం నిర్వహించడంపై మున్సిపల్ అధికారులు చూపుతున్న శ్రద్ధ సంత కోసం ప్రభుత్వ స్థలంలో అన్ని వసతులతో జరిగే విధంగా చూపితే ప్రజలు సంతోష పడతారని ఆయన పేర్కొన్నారు.


## చెక్ డ్యాం నిర్మాణంలో టెక్నికల్ అసిస్టెంట్ పాత్ర కీలకం



చెక్ డ్యాం నిర్మాణానికి కృషి చేసిన టెక్నికల్ అసిస్టెంట్ సత్యన్నను సన్మానిస్తున్న రైతులు

**కొత్తకోట రూరల్:** చెరువులోని నీరు మరో చెరువులోకి, చెక్ డ్యాం ద్వారా సాగు పెరిగేందుకు కృషి చేసిన టెక్నికల్ అసిస్టెంట్ పాత్ర కీలకమని పలువురు రైతులు అభినందనలు తెలిపారు. పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లి చెరువు నుంచి అలుగు పారి పెద్దమందడి చెరువులోకి వస్తున్న సాగునీటికి నేరెళ్ల వంపు సమీపంలో చిన్న చెక్‌డ్యామ్‌ను నిర్మించి పెద్దమందడి, దొడగుంటపల్లి గ్రామాల్లోని 70 మందికి రైతులకు సంబంధించిన 30 ఎకరాల బీడు భూములకు సాగునీటి వసతి ఏర్పడింది. వంపు సమీపంలో బోర్ల కింద సాగు చేస్తున్న మరో 30ఎకరాలు సాగుకులోకి వచ్చాయి. గతంలో ఇక్కడి రైతులు ఇసుక సంచులతో నీటిని నిలిపే ప్రయత్నం చేసినప్పటికీ ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఎన్ఆర్ఈజీఎస్‌లో పెద్దమందడి టీఏ కం ఈసీ (టెక్నికల్ కం అసిస్టెంట్. ఇంజినీరింగ్ కన్సల్టెంట్)గా పనిచేస్తున్న కె.సత్తన్న దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఆయన అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి రూ.4లక్షల 59 వేల నిధులతో నేరెళ్ల వంపులో చెక్ డ్యామ్ ను నిర్మించారు. గతేడాది నిర్మించిన ఈ చెక్ డ్యాం వల్ల దాదాపు 30 ఎకరాల్లో రైతులు వరి పంటలు సాగు చేశారు. నేరెళ్ల పంపు సమీపంలోని వ్యవసాయ బోరు బావులలో భూగర్భ జలాలు వృద్ధి చెంది మరో 30ఎకరాలు పరోక్షంగా సాగులోకి వచ్చాయి. ఇదంతా సత్యన్న కృషి వల్లే సాధ్యమైందని, సత్యన్న బదిలీపై ఘణపురం మండలానికి వెళ్తుండటంతో శుక్రవారం ఆయనను నేరెళ్ల వంపు దగ్గరకు తీసుకెళ్లి పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## వక్ఫ్‌భూములను పరిరక్షించాలి



ఆత్మకూర్‌లో నిరసన తెలుపుతున్న ముస్లింలు

**ఆత్మకూర్:** కుల మతాల పేరిట విద్వేశాలు రెచ్చగొడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేస్తోందని, ముస్లింలను టార్గెట్ చేస్తూ వేధింపులకు గురి చేస్తోందని మౌలాన అబ్దుల్‌అలీం రశాదీ, మౌలాన జీయా ఉర్ రహ్మాన్, మౌలాన ముక్తదీర్, మౌలానా ఇర్ఫాన్, మౌలాన తమీమ్ అన్సారి, హఫీజ్ అజ్హర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లను వ్యతిరేకిస్తూ పవిత్ర రంజాన్ మాసంలోని చివరి శుక్రవారం కుడిచేతులకు నల్ల గుడ్డలు కట్టుకుని స్థానిక మస్జీదే ఆజంజాహి, మస్జిదేసయ్యదియా, ఈద్గామస్జీద్‌లతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లోని మసీదుల్లో నమాజ్ అనంతరం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రపంచశాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు



మస్జిదేనూర్‌లో ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

**ఆత్మకూర్:** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు శుక్రవారం రాత్రి పట్టణంలోని ఆయా మసీదుల్లో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో నిర్వహకులు, ముస్లిం పెద్దలు, దీక్షపరులు పాల్గొన్నారు.